ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
బుధవారం 10 జనవరి 2024





సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్ సింగ్

ఇంకా.. పాత వారేనా!

- కొత్త పాలకవర్గంపై దృష్టి సారించని కాంగ్రెస్ సర్కారు
- రిజర్వేషన్లపై వీడని ఉత్కంఠ
- పదవుల కోసం పలువురి ఆశలు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జనవరి 9 : రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.. 'హస్తం' పార్టీ అధికార పీఠాన్ని అధిష్ఠించినా.. పాత వ్యవసాయ మార్కెట్ కమిటీలే కొనసాగుతున్నాయి. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా.. పాత కమిటీలు రద్దు కాలేదు.

గత ప్రభుత్వ హయంలో నామినేటెడ్ పోస్టును దక్కించుకున్న బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తమ పదవులను స్వచ్ఛందంగా రాజీనామా చేయాల్సి ఉంది. జిల్లాలోని మహబూబాబాద్, కేసముద్రం వ్యవసాయ మార్కెట్ల చైర్మన్లు, కమిటీ డైరెక్టర్లు రాజీనామా చేయకుండా ఆయా పదవుల్లో కొనసాగుతున్నారు. అయితే పదవి చివరి రోజుల్లో ఉండడంతో పలు పనులకు, పలువురిని సిబ్బందిగా పెట్టుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

మార్కెట్ పాలకమండలి నిరాశ..

జిల్లాలోని కేసముద్రం, మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకమండలిని అప్పటి ప్రభుత్వం గతేడాది మార్చి రెండోవారంలో ప్రకటించింది. నిజానికి మార్కెట్ చైర్మన్ల, కమిటీల పదవీకాలం మూడేళ్ల వరకు గత సంవత్సరం నుంచి పెంచారు. అంతకు ముందు మార్కెట్ చైర్మన్లు, కమిటీల పదవీకాలం ఏడాది కాలం వరకే కొనసాగేది. దీంతో ఆయా మార్కెట్ కమిటీలు ఉత్సాహంగా పదవీబాధ్యతలు చేపట్టి, పాలనా కొనసాగించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడంతో కమిటీలు డీలా పడిపోయాయి. అయితే రాష్ట్రంలో మిగితా కమిటీలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయగా, వ్యవసాయ మార్కెట్ కమిటీలను మాత్రం రద్దు చేయలేదు. రేపోమాపో మార్కెట్ కమిటీల రద్దు అయ్యే అవకాశాలు ఉన్నాయి. అప్పటి వరకు తామేందుకు రాజీనామా చేయాలని, పదవుల్లోనే కొనసాగాలని పాలకమండలి నిర్ణయించుకుంది.

పైరవీల జోరు..

మార్కెట్ కమిటీల పదవులు చివరి క్షణాల్లో ఉండడంతో పలు పోస్టులకు, ఇతర పనులకు గాను పైరవీలు మొదలు పెట్టారు. వారం రోజుల క్రితం ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌ను సం దర్శించారు. ఆ సమయంలో మార్కెట్ పదవుల విషయం తెలిసి రాష్ట్రప్రభుత్వం కమిటీలు రద్దు అయ్యే వరకు ఏ కార్యక్రమాలు ప్రోత్సహించరాదని మార్కెట్ కార్యదర్శిని హెచ్చరించినట్లు తెలిసింది. అలాగే మార్కెట్ కమిషనర్, మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ కూడా ఎలాంటి ప్రోత్సాహం అందించరాదని సూచించింది.

మహబూబాబాద్ ఎమ్మెల్యేభూక్య మురళీనాయక్ ఈ విషయాలు తెలిసి ఆయన కూడా అధికారులతో మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం! మొత్తానికి వీరిద్దరూ కలిసి మార్కెట్ కమిటీలను రద్దు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీ సుకువెళ్లనున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారి ఒకరు మానుకోట మార్కెట్ కార్యాలయానికి ఫోన్‌చేసి, ఎలాంటి నియామకాలు కానీ.. పనుకాని చేయవద్దని సూచించినట్లు సమాచారం.

రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వని సర్కారు..

బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇతర శాఖలకు రిజర్వేషన్లు ఉన్న మాదిరిగానే మార్కెట్ కమిటీలకు కూడా రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో 2018లో ఉత్తర్వులు జారీచేసి మార్కెట్ కమిటీలకురిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. దీంతో ఆయా మార్కెట్లకు రిజర్వేషన్ల ప్రాతిపదికపై చైర్మన్లను ఎంపిక చేస్తున్నారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో మార్కెట్లలో అమలవుతున్న రిజర్వేషన్లను రద్దు చేస్తారా..! లేక రిజర్వేషన్లను అలాగే ఉంచి కొత్త కమిటీలను ప్రకటిస్తారా? అనే విషయంపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టం చేయ లేదు.

ఒకవేళ ఆ రిజర్వేషన్లు అలాగే ఉన్నట్లయితే కొత్తగా వచ్చే మహబూబాబాద్ మార్కెట్ చైర్మన్‌గా ఎస్టీ జనరల్‌కు చెందిన నాయకుడికే దక్కుతుంది. కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు ఓసీ ఉమెన్ కేటాయించగా తొర్రూరు మార్కెట్ ఓసీ జనరల్‌కు దక్కుతాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. కాగా, మార్కెట్ కమిటీల రద్దు ప్రకటించి.. కొత్త కమిటీలను ఎంపిక చేయడానికి ప్రకటిస్తే కాంగ్రెస్ వర్గాల్లో ఆ పదవులకు జోరుగా పైరవీలు కొనసాగనున్నాయి.

వ్యవసాయ మార్కెట్ కమిటీల రద్దు ఎప్పుడో?





మార్కెట్ కమిటీలను రద్దు చేయాలని మంత్రి తుమ్మలకు వినతిపత్రం అందజేస్తున్న డోర్నకల్ కాంగ్రెస్ నేతలు

మంత్రి తుమ్మలకు ఫిర్యాదు..

డోర్నకల్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు మాద శ్రీనివాస్, తాళ్లూరి హనుమలు మార్కెట్ కమిటీలను రద్దు చేయాలని ఖమ్మం జిల్లాలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు గత ఐదురోజుల క్రితం ఫిర్యాదు చేశారు. హస్తం పార్టీలో గెలుపు కోసం కష్టపడి పని చేసిన వారిని గుర్తించి, నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని కోరారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకుపోతానని తుమ్మల వారితో అన్నట్లు తెలిసింది.

కమిటీల రద్దుపై ఉత్తర్వులు రాలేదు...

ప్రసాదరావు, ఇన్‌చార్జి జిల్లా మార్కెటింగ్ అధికారి

జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల రద్దుపై కొత్త ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. ఇప్పటి వరకు జిల్లాలోని మహబూబాబాద్, కేసముద్రం మార్కెట్‌లలో పాత కమిటీలే కొనసాగుతున్నాయి. సర్కారు నుంచి రద్దు చేస్తున్నట్లు ప్రకటిస్తే ఆ కమిటీలు రద్దవుతాయి.

వైద్యశాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వైద్యశాఖ అధికారులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం వైద్యశాఖ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. వైద్యశాఖ ప్రగతి నిర్వహణ తీరును పవర్‌పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాఖ అధికారులు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. తొలుత తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో నిర్వహిస్తున్న వైద్యశాఖ పనితీరును అడిగి తెలుసుకున్నారు. గూడూరు, గార్ల, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు 30 పడకల ఆస్పత్రులుగా తమ పరిధిలో ఉన్నాయని, జిల్లా వైద్యవిధాన పరిషత్ పరిశీలకుడు బి.వెంకట్రాములు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం మెడికల్ కళాశాల పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. సర్వే నెంబర్ 551లో 30 ఎకరాల్లో మెడికల్ కళాశాల భవన నిర్మాణాలు చేపట్టామని, ఆపనులు కొనసాగుతు న్నాయని వివరించారు. 145 మంది సిబ్బందితో మెడికల్ కళాశాల నిర్వహణ కొనసాగుతోం దన్నారు. జనరల్ ఆస్పత్రి పర్యవేక్షకుడు శ్రీనివాస్ వివరిస్తూ వందపడకలతో కొనసాగుతున్న జిల్లాఆస్పత్రి 330 బెడ్స్‌తో రోగులకు అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. జిల్లాలో 20 పీహెచ్‌సీలు ఉన్నాయని, మరోమూడింటిని అదనంగా చేపట్టినట్లు డీఎంఅండ్ హెచ్‌వో అంబరీష తెలిపారు. టీబీ వ్యాధులపై అవగాహన పెంచాలని, మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ కేసులు నమోదు కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో అగ్రస్థానంలో నిలపాలి

- జిల్లా ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ



నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 9 : త్వరలో జరుగనున్న ఇంటర్ ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ సూచించారు. మహబూబాబాద్‌లో మంగళవారం తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్-475 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఐఈవో మాట్లాడుతూ త్వరలో జరుగబోయే ఇంటర్ వార్షిక పరీక్షలకు హాజరయ్యే ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు వీరేందర్, అశోక్, రవీందర్, రవికిరణ్, సుశీల తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన సామాజిక సేవా శిఖరం

- గుండెపోటుతో రామా శ్రీనివాస్ కన్నుమూత
- మోక్షారామం ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు
- హైదరాబాద్‌లో నివాళులర్పించిన కేటీఆర్, హరీ‌ష్‌రావు
- విషాదంలో ఓరుగల్లు... నేడు అంత్యక్రియలు





శ్రీనివాస్ భౌతిక దేహానికి నివాళులర్పిస్తున్న కేటీఆర్, హరీ‌ష్‌రావు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 9: సామాజిక సేవా శిఖరం నేలకొరిగింది. పిలిచిన వెంటనే తానున్నానంటూ ఎందరికో అండగా నిలిచిన మానవతా మూర్తి కన్నుమూశారు. సామాజిక సేవను జీవితంలో ఒకభాగంగా మలుచుకున్న ఆదర్శనీయుడు కనుమరుగైపోయారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, సామాజిక సేవకుడు రామా శ్రీనివాస్(59) హైదరాబాద్‌లో మంగళవారం గుండెపోటుతో కన్నుమూయడంతో ఓరుగల్లు విషాదంలో మునిగిపోయింది. ఉదయం ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు యశోద ఆస్పత్రికి తరలించగా, చికిత్స అందిస్తున్న క్రమంలో మృతిచెందారు.

వరంగల్ రామన్నపేటలో జన్మించిన శ్రీనివా‌స్‌కు భార్య శోభారాణి, కుమారుడు శైలేష్, కూతురు స్వాతి ఉన్నారు. నలుగురు సోదరులు, సోదరి ఉన్నారు. పద్మశాలీ సామాజిక వర్గానికి చెందిన శ్రీనివాస్ పేద ప్రజలకు నిరంతరం సేవలందిస్తూ అభివృద్ధికి పాటుపడ్డారు. 2016 నుంచి సేవా కార్యక్రమాలకు కోట్లాది రూపాయలు ఖర్చుచేశారు. రామన్నపేటలో మోక్షారామం ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి లక్షలాది రూపాయలతో శ్మశాన వాటికను అభివృద్ధి పర్చి అందమైన గార్డెన్‌గా తీర్చిదిద్దారు. ఇల్లులేని వారు కుటుంబ సభ్యులు ఎవరైనా అకాల మృతి చెందితే వారి దహన సంస్కారాలు, కర్మకాండలు పూర్తయ్యే వరకు ఉచితంగా ఉండటం కోసం శ్మశాన వాటికలో నాలుగు గదులు నిర్మించారు.

వృద్ధులు, ఒంటరి వారు, దివ్యాంగుల కోసం అమ్మఒడి భవనంలో నిత్యం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పండుగలు, సంస్కృతీ సంప్రదాయాలు, బొడ్డెమ్మ, బతుకమ్మ, దసరా, సంక్రాంతి ముగ్గులు కార్యక్రమాలను నిర్వహించి బహుమతులను ప్రదానం చేసే వారు. నిరుపేద ఆడపిల్లల కుటుంబాలకు వివాహానికి బంగారు పుస్తే, మట్టెలు, బట్టలు, నగదు సహాయం చేసేవారు.

కరోనా సమయంలో ప్రతీరోజు ఆస్పత్రులకు , పోలీసు సిబ్బందికి వేయి మందికి ఆహారం అందించారు. నగర ప్రజలు ప్లాస్టిక్ వాడొద్దని బట్ట సంచులు కుట్టించి ఇంటింటికీ వితరణ చేశారు. చెత్త కోసం ఉపయోగించడానికి ప్రతీ ఇంటికి రెండు డస్ట్ బిన్‌లు ఇచ్చారు. నగరంలో చెత్త తీసుకెళ్లడానికి దాదాపు రూ. కోటితో 420రిక్షాలను గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్యాలయానికి అందజేశారు. ఆలయాలకు , స్వచ్ఛంద సంస్థలకు విరాళాలు అందజేశారు. రామన్నపేట ప్రజల కోసం మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేసి కేవలం నాలుగు రూపాయలకే 20 లీటర్ల మంచినీరు అందిస్తున్నారు.

నగరంలో విషాదచాయలు..

రామా శ్రీనివాస్ ఇకలేరనే వార్త తెలిసి వరంగల్ వాసులు, మోక్షారామం, అమ్మ ఒడి కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. పద్మశాలీ కులబాంధవులు, వైద్యులు, న్యాయవాదులు, ఇంజనీర్లు, పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు దిగ్భ్రాంతికి లోనయ్యారు.

కేటీఆర్, హరీ‌ష్‌రావు నివాళి..

శ్రీనివాస్ అకాల మృతి విషయం తెలియగానే టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీ‌ష్‌రావు హుటాహుటిన హైదరాబాద్ సోమాజిగూడలోని శ్రీనివాస్ నివాసానికి వచ్చి భౌతిక కాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణితోపాటు పలువురు ప్రముఖులు, అధికారులు శ్రీనివాస్ భౌతిక దేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. మంగళవారం రాత్రి హైదరాబాద్ నుంచి వరంగల్ నగరానికి శ్రీనివాస్ భౌతిక కాయాన్ని తీసుకొచ్చారు. బుధవారం ఉదయం రామన్నపేటలోని మోక్షారామం ఫౌండేషన్ ఆధ్వర్యంలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రముఖులతో సంబంధాలు

పారిశ్రామికవేత్తగా, సేవాతత్పరుడిగా ఉన్న శ్రీనివాస్ దేశంలో, రాష్ట్రంలో పలువురు ప్రముఖులతో సన్నిహిత సంబంధాలు కొనసాగించారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని నరేంద్రమోదీ, మాజీ సీఎంలు చంద్రబాబు, కేసీఆర్‌తో పాటు దివంగత మాజీ సీఎం రాజశేఖర్‌రెడ్డికి సన్నిహితంగా మెలిగారు. అలాగే ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతోపాటు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, పద్మశాలీ ప్రముఖులకు సుపరిచితుడిగా ఉన్నారు.

ఓపెన్ డిగ్రీలో ప్రవేశానికి గడువు పెంపు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 9 : మానుకోటలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రథమ సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు ఈనెల 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు నూకల రాచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజు, కోఆర్డినేటర్ సీహెచ్ మల్లేషం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరం ఓపెన్ డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు విద్యార్హత ఇంటర్మీడియట్ లేదా ఓపెన్ ఇంటర్ లేదా పాలిటెక్నిక్ లేదా రెండు సంవత్సరాల ఐటీఐ కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ : 73829 29705ను సంప్రదించాలన్నారు.

ఐలోని మల్లన్న జాతరకు రండి..

సీఎంను కలిసిన మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే నాగరాజు

ఆహ్వాన పత్రిక అందజేత



సీఎం రేవంత్‌రెడ్డికి జాతర ఆహ్వాన పత్రికతోపాటు మల్లన్న స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న మంతి కొండా సురేఖ, ఎమ్మెల్యే నాగరాజు

ఐనవోలు, జనవరి 9: లక్షలాది మంది భక్తులు కొలిచే ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. దేవదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరా మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎంను కలిసి జాతర ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ నెల 14, 15 తేదీలలో జరిగే మహాజాతర తీరును వివరిస్తూ జాతరకు రావాలని కోరుతూ ఆలయ అర్చకులు కోరుతూ స్వామి వారి చిత్రపటం, ప్రసాదంతోపాటు వేద ఆశీర్వచనం అందజేశారు. కాగా, టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఉన్న సమయంలో కిందటేడు ఫిబ్రవరి 16న 'హాత్‌సే హాత్ జోడో పాదయాత్రలో భాగంగా ఐనవోలు ఆలయ సమీపంలో విడిదిచేశారు. మరుసటి రోజు స్వామి వారిని దర్శించుకొని పాదయాత్రను ప్రారంభించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే నాగరాజుతోపాటు అర్చకులు సీఎంకు గుర్తు చేయగా సంతోషించారు. ఆహ్వానంపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, వేదపండితులు పురుషోత్తంశర్మ, విక్రాంత్‌జోషి, అర్చకుడు నరేష్‌శర్మ, సీనియర్ న్యాయవాది నిమ్మాని శేఖర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, నాయకులు కుందూరు వెంకట్‌రెడ్డి, పింగిళి వెంకట్‌రెడ్డి, గొట్టిముక్కుల రమాకాంత్‌రెడ్డి, ఆలయ అధికారులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

పది జోన్లుగా మేడారం

- పని విభజన చేసి సౌకర్యాలు కల్పించాలి
- 31లోగా మహాజాతర ఏర్పాట్లు పూర్తికావాలి
- రూ.30 కోట్ల విడుదలకు గ్రీన్‌సిగ్నల్
- భక్తుల కోసం 6 వేల ఆర్టీసీ బస్సులు
- ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో మంత్రుల సమీక్ష
- పాల్గొన్న ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు, పోలీసు, ఇతర శాఖల అధికారులు



మేడారం సమీక్షలో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు

ములుగు, జనవరి 9: ఈ ఏడాది ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజుల పాటు జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరను విజయవంతంగా జరిపించాలని, మొత్తం పది జోన్లుగా పనులను విభజించి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర మంత్రులు అధికారులను ఆదేశించారు. రూ.75 కోట్ల నిధులతో మొదలుపెట్టిన పనులను ఈనెల 31లోగా పూర్తి చేయాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా ఆధ్వర్యంలో రాష్ట్ర ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం మంగళవారం జరిగింది. పోలీసు, రెవెన్యూ, అటవి, రోడ్లు భవనాలు, నీటిపారుదలశాఖల ఉన్నతాధికారులతోపాటు హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు చెందిన కలెక్టర్‌లు, ఎస్పీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడతూ జాతరకు వచ్చే భక్తులు ప్రశాంతంగా వనదేవతలను దర్శించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా కళాకారులతో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలన్నారు. స్నానఘట్టాల వద్ద విస్తృత ఏర్పాట్లు చేయాలన్నారు. జంపన్నవాగులోని నీరు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పారిశుధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలన్నారు. తాగునీటి వసతిని మెరుగుపర్చాలని, క్యూలైన్లలో భక్తులకు ఇబ్బంది జరగకుండా చూడాలని అన్నారు. రూ.75 కోట్లకు అదనంగా మరో రూ.30 కోట్ల కోసం అధికారులు సమర్పించిన ప్రతిపాదనలను ఆమోదించి వెంటనే నిధులను విడుదల చేస్తామని చెప్పారు. అధికారులు సమన్వయంతో పని చేస్తేనే జాతర సక్సెస్ అవుతుందని అన్నారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో మహిళా భక్తుల రద్దీ పెరిగే అవకాశముందని, అందుకు అనుగుణంగా సౌకర్యాలు మెరుగుపర్చాలని తెలిపారు. ఈసారి 6వేల బస్సులను నడిపించడానికి ఏర్పాట్లు చేస్తామన్నారు. జాతర నిర్వహణపై అనుభవం ఉన్న అధికారులను గుర్తించాలని, వారు రాష్ట్రంలోని ఏ జిల్లాలో ఉన్నా ప్రత్యేకంగా కేటాయిస్తామని తెలిపారు. గత జాతరలలో పనిచేసిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు.

పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి సీతక్క మాట్లాడుతూ జాతరను ప్లాస్టిక్ రహితంగా జరిపించాలన్నారు. రోడ్ల మరమ్మతులను సత్వరమే పూర్తిచేయాలని, ఇరువైపులా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. జాతరలో తప్పిపోయిన వారిని కుటుంబ సభ్యుల చెంతకు చేర్చేలా కాల్‌సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ఆదివాసీ సంప్రదాయాలకు అత్యంత ప్రాముఖ్యతనిస్తూ జాతర జరిపించాలన్నారు. దొంగతనాలు జరగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు.

మహాజాతర విశిష్టతపై డాక్యుమెంటరీని రూపొందించాలని అధికారులకు సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం చర్యలు తీసుకోవాలన్నారు. జాతరకు వచ్చే భక్తులకు అవగాహన కల్పిస్తూ సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు. 400 సీసీ కెమెరాలతో భద్రతను పర్యవేక్షిస్తామని డీజీపీ తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపడతామన్నారు. ఈ సమీక్షలో ములుగు జిల్లా కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎస్పీ శబరీశ్, ఇటీవల ఆదిలాబాద్‌కు బదిలీపై వెళ్లిన ఎస్పీ గాష్‌ఆలం, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్, ములుగు డీఎస్పీ రవీందర్, ఇరిగేషన్ సీఈ విజయభాస్కర్, ఐటీడీఏ ఈఈ హేమలత, డీపీవో వెంకయ్య, డీపీఆర్‌వో రఫీఖ్ పాల్గొన్నారు.

'బీజేపీతోనే దేశాభ్బృద్ధి'



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచందర్‌రావు

నెల్లికుదురు, జనవరి 9 : బీజేపీతోనే దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతోందని పార్టీ జిల్లా అధ్యక్షుడు ఒద్దిరాజు రామచందర్ రావు అన్నారు. నెల్లికుదురులో మంగళవారం 'మహాసంకల్పం వికసిత భారతం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలపై గ్రామస్తులకు అవగాహన కలిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో మహిళలకు, సాధారణ ప్రజలకు అవసరమైన పథకాలు ప్రవేశపెట్టి నరేంద్రమోదీ సుస్థిరపాలన కొనసాగిస్తోందన్నారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు, ఇన్సూరెన్స్‌లు, వ్యవసాయ పనిముట్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ పరిశీలకులు రావిష్‌ప్రసాద్, ఎల్‌డీఎం సత్యనారాయణమూర్తి, సర్పంచ్ బీరవెల్లి యాదగిరి రెడ్డి, ఎంపీటీసీ ఎన్నాకుల వాణీశ్రీనివాస్, ఏవో రవీందర్ రెడ్డి, బీజేపీ నాయకులు చందు రాజుకుమార్, చీకటి మహేష్, సతీష్, గోపగాని శ్రీను, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రేపు గూడూరులో వాహనాలకు వేలం

గూడూరు, జనవరి 9 : గూడూరు ప్రొహిబిషన్‌అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 11న ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ బిక్షపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎక్సైజ్ అధికారి కిరణ్ సమక్షంలో ఆయా కేసుల్లో పట్టుబడిన ఒకలారీ, రెండు అశోక్ లేలాండ్ గూడ్స్, రెండు బొలేరో గూడ్స్ వాహనాలతో పాటు ద్విచక్రవాహనాలకు వేలం పాట నిర్వహించనున్నట్లు చెప్పారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



వెంకన్న (ఫైల్)

గార్ల, జనవరి 9 : అప్పుల బాధతో చాపల వెంకన్న (38) అనే రైతు పురుగుల మందుతాగి, బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని పుల్లూరు గ్రామపంచాయతీ శివారు గుడిపాటి బంజరలో మంగళవారం జరిగింది. ఏఎస్సై వీరారెడ్డి తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బంజర గ్రామానికి చెందిన చాపల వెంకన్న ఎంఏ, బీఈడీ పూర్తిచేసి, ఉద్యోగం రాకపోవడంతో వారసత్వంగా సంక్రమించిన ఎకరం 20కుంటల మెట్టభూమిలో మిర్చితోటను సాగు చేస్తున్నాడు. గత రెండేళ్లుగా మిర్చిని సాగు చేస్తున్నా తెగుళ్లు సోకడంతో సరైన దిగుబడి రాలేదు. కాగా, గత రెండేళ్లలో పంటపెట్టుబడి కోసం రూ.3 లక్షల వరకు అప్పులు అయ్యాయి. ఈ నేపథ్యంలో అప్పులు తీరుతాయోలేదోనని వెంకన్న తీవ్ర మనస్థాపానికి గురై పరుగుల మందు సేవించి. సమీపంలోని బావిలోకి దూకి ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అటు వెళ్లిన గొర్రెల కాపరి బావిలో శవాన్ని గమనించి, గ్రామస్తులకు సమాచారం అందించాడు దీంతో చుట్టుపక్కల రైతులు మృతదేహన్ని బయటకు తీయగా చాపల వెంకన్నగా గుర్తించారు. మృతుడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు ఏఎస్సై వీరారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

2 రోజుల పాటు హసన్‌పర్తి రైల్వే గేటు మూసివేత

కాజీపేట, జనవరి 9: రైల్వే మూడోలైన్ నిర్మాణాల పనుల దృష్ట్యా బుధవారం, గురువారం రెండు రోజులపాటు హసన్‌పర్తి రైల్వే గేటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైల్వే గేటు ద్వారా ప్రయాణించే వారు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాలని తెలిపారు. శుక్రవారం నుంచి యథావిధిగా ఈ గేటు తెరిచి ఉంటుందని చెప్పారు.

ఎంబీఏ మూడో సెమిస్టర్ ఫీజు గడువు 22

కేయూ క్యాంపస్, జనవరి 9: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎంబీఏ మూడో సెమిస్టర్ పరీక్షలఫీజులు జనవరి 22 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధి కారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.250 అపరాధ రుసుంతో జనవరి 24వ తేదీ వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎంబీఏ మూడో సెమిస్టర్ రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూమెంట్ అభ్యర్థులందరూ ఫీజుల చెల్లించుకోవాలన్నారు.

కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 5గురు డీబార్

కేయూ క్యాంపస్, జనవరి 9: కేయూ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ 1,3,5వ సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం 5 గురు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడగా తనిఖీ అధికారులు పట్టుకుని డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డాక్టర్ ఎం.తిరుమలదేవి తెలిపారు. డీబారైన వారిలో ఉమ్మడి ఖమ్మంలో -2, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 3 మంది డీబారైనట్లు తెలిపారు. వీరిపై చర్యలుంటాయని తెలిపారు.

నూతన పెన్షన్ విధానాన్ని

రద్దు చేయకుంటే సమ్మె చేస్తాం..

మజ్దూర్ యూనియన్ జోనల్ ప్రెసిడెంట్ కాల్వ శ్రీనివాస్



మాట్లాడుతున్న కాల్వ శ్రీనివాస్

కాజీపేట, జనవరి 9: కేంద్ర ప్రభుత్వం నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయకుంటే సమ్మె చేయడానికైనా సిద్ధమని దక్షిణ మధ్య రైల్వే జోనల్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్ హెచ్చరించారు. పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్ లోకో బ్రాంచ్ ఛైర్మన్ పాక వేదప్రకాశ్ ఆధ్వర్యంలో డీజిల్ షెడ్ వద్ద రెండో రోజు రిలే దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను కాల్వ శ్రీనివాస్ హాజరై ప్రారంభించి మాట్లాడారు. రైల్వే కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని కార్మికులు వారి కుటుంబాలు గమనిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో కార్మికుల పక్షాన ఉన్న పార్టీలకే తమ మద్దతు ఉంటుందన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వారికే మద్దతిస్తామన్నారు. దీక్షలో కూర్చున్న వారిలో బ్రాంచ్ నాయకులు ఎస్.కె. జానీ, తిరుపతి, ప్రదీప్‌రాయ్, యాదగిరి, పి.రవి కిరణ్, నరేష్ యాదవ్, మాషక్ జానీ, ఎ.సదానందం, జి.నాగరాజు ఉన్నారు.

బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్న పోలీసు అధికారులు

అభినందించిన సీపీ అంబర్ కిశోర్ ఝా



పోలీసు క్రీడాకారులను అభినందిస్తున్న సీపీ

హనుమకొండ క్రైం, జనవ రి 9: రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో వరంగల్ పోలీసు కమిషనరేట్‌కు చెందిన ఇద్దరు పోలీసు అధికారులు ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు వరంగల్ ఎస్‌బీ ఏసీపీ మూల జితేందర్‌రెడ్డి, ఏఆర్ అదనపు డీసీపీ కె.సంజీవ్‌లను వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా అభినందించారు. మంగళవారం సీపీ కార్యాలయానికి పిలి పించి ఇద్దరు అధికారులను ఘనంగా సత్కరించారు. ఈ నెల 5 నుంచి 7 వరకు హైదరాబాద్‌లో జరిగిన 9వ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో సత్తాచాటారు. 55 యేళ్ల విభాగంలో జితేందర్‌రెడ్డి సింగిల్స్, మిక్స్ డబుల్స్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించగా, 60 యేళ్ల విభాగంలో సంజీవ్ బ్రాంజ్ మెడల్ సాధించారు. వీరిని జాతీయస్థాయి పోలీసు క్రీడలకు ఎంపిక చేసినట్టు నిర్వాకులు తెలిపారు. సత్తాచాటి పతకాలు సాధించిన క్రీడాకారులను వరంగల్ పోలీసు కమిషనరేట్ అధికారులు, సిబ్బంది అభినందించారు.

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	సినీ ప్లానెట్ - కొంపల్లి
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఫోరం మాల్ - కూకట్‌పల్లి	ఏషియన్ రాధిక - కాప్రా
ఆర్.కె. - బంజారాహిల్స్	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
గలేరియా - పంజాగుట్ట	మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
ఐకాన్ - హైటెక్‌సిటీ	మిరాజ్ సినిమాస్ - బాలానగర్
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మిరాజ్ సినిమాస్ - చందానగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	లక్ష్మీనరసింహ - మియాపూర్
ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
ఆట్రియమ్ - గచ్చిబౌలి	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
ఎస్2 నోమ - మల్లాపూర్	మూవీటైమ్ - అమీర్‌పేట
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
ఎం.పి మాల్ - కాచిగూడ	టివోలి - సికింద్రాబాద్
జిఎస్ఎమ్ - మదీనగూడ	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
నెక్లెస్ సత్య - కవాడిగూడ	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	షా షహెన్‌షా - చింతల్
మంజీరామాల్ - కూకట్‌పల్లి	లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	మూవీమ్యాక్స్ - మౌలాలి
మంత్రామాల్- అత్తాపూర్	జె.పి.సినిమాస్ - చందానగర్
సుధా - శాలిబండ	మరియు
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్	మీ అభిమాన థియేటర్లలో



ఒకే జాతీయ గ్రామీణ బ్యాంకుగా ఏర్పాటు చేయాలి

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

కాళోజీ జంక్షన్, జనవరి 9: దేశ వ్యాప్తంగా ఉన్న 43 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులన్నింటినీ కలిపి ఒకే జాతీయ గ్రామీణ బ్యాంకుగా ఏర్పాటు చేయాలని కోరుతూ హనుమకొండ రాంనగర్‌లోని వరంగల్ గ్రామీణ వికాస బ్యాంకు ప్రధాన కార్యాలయం ఎదుట బ్యాంకు ఉద్యోగుల సంఘం, అధికారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి కారింగ్ భిక్షమయ్య గౌడ్ మాట్లాడుతూ.. గ్రామీణ వికాస బ్యాంకులో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నట్లు వాటి పరిష్కారం కోసం యాజమాన్యం దృష్టికి తెచ్చేందుకు ధర్నా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. బ్యాంకులో 20 యేళ్లుగా తాత్కాలిక ఉద్యోగులుగా పనిచేస్తున్న సుమారు 700మంది ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని గ్రామీణ వికాస బ్యాంకులను స్పాన్సర్ బ్యాంకుల నుంచి విడదీయాలని, మ్యాన్ పవర్ పాలసీ ప్రకారంగా ప్రమోషన్లు, నియామకాలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేగాక వాణిజ్య బ్యాంకుల మాదిరిగా ఉద్యోగులకు గ్రాట్యుటీ బేసిక్‌పే, డీఏ కలిపి చెల్లించాలని అన్నారు. ధర్నా అనంతరం ఉద్యోగ సంఘం నాయకులు బ్యాంకు జనరల్ మేనేజర్ దయాకర్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాజు, అధికారుల సంఘం అధ్యక్షుడు క్రాంతి కుమార్, ప్రధాన కార్యదర్శి అప్పలనాయుడు, బ్యాంకు పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు జయరాములు, కుంభం వెంకట్‌రెడ్డి, సత్యపాల్‌రెడ్డి, వీరయ్య, మల్లయ్య, రమేష్, తిరుమలేశ్వర్‌రావు, ఉభయ సంఘాల కోర్ కమిటీ సభ్యులు, ప్రాంతీయ కార్యదర్శులు సుమారు 300 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.


ధర్నాలో మాట్లాడుతున్న ఏపీజీవీబీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి భిక్షమయ్య గౌడ్

బాధితులకు ఊరట

● వన్య ప్రాణుల దాడిలో ధ్వంసమైన పంటలకు పరిహారం పెంపు
● అధికారుల సహకారం కోసం రైతుల ఎదురుచూపులు


గూడూరు అభయారణ్యంలో సంచరిస్తున్న అడవిపందులు(ఫైల్)

గూడూరు, జనవరి 9: వన్యప్రాణుల దాడులతో నష్టపోయిన వారికి ఇచ్చే నష్టపరిహారాలను పెంచుతూ రాష్ట్ర అటవీశాఖ ఇటీవల ఉత్తర్వులను జారీ చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ఏజెన్సీ గ్రామాలు అటవీ ప్రాంతాలకు దగ్గరగా ఉండడంతో వ్యవసాయక్షేత్రాలకు రైతులు వెళ్లిన సమయంలో తరచూ వన్యప్రాణుల బారిన పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే వన్యప్రాణులు వేల ఎకరాల్లో పంటలను నష్టం చేస్తున్నాయి. గతంలో నష్టపరిహారానికి ఉత్తర్వులు ఉన్నప్పటికి కొందరికే పరిహారం మంజూరైంది. రెండేళ్లుగా పంటనష్ట పరిహారానికి సంబంధించి దరఖాస్తులను తీసుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వన్యప్రాణుల వల్ల జరిగే నష్టానికి పరిహారం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. దీంతో ఏజెన్సీ ప్రాంత సాగు రైతులకు కొంతమేర మేలు జరుగనుంది.

15.49 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లో రైతులు 15.49 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను సాగుచేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో 1.50 లక్ష హెక్టార్లలో అటవీ విస్తరించి ఉంది. జిల్లాలోని పలు గ్రామాలు ఏజెన్సీ గ్రామాలు, అటవీప్రాంతాలకు దగ్గరగా ఉండడం ద్వారా అడవి పందుల బెడద ఎక్కువగా ఉంటోంది. ఈ సీజన్‌లో సుమారు 19 నుంచి 20 వేల ఎకరాల్లో పంటలకు నష్టం జ రుగుతున్నట్లు ప్రాథమిక అంచనా. పరిహారం పొం దడంపై అవగాహన లోపం, త్వరగా మంజూరు కాకపోవడంతో చాలామంది గిరిజన, గిరిజనేతర రైతులు ప్రభుత్వానికి దరఖాస్తు కూడా చేసుకోవడం లేదు. రైతులు రాత్రి, పగలు కష్టపడుతున్నా వన్యప్రాణుల నుంచి పంటలను మాత్రం కాపాడుకోలేకపోతున్నారు. అడవి పందులు పంటల యొక్క వాసన పసిగట్టే గుణం కలిగి ఉంటాయి. మొక్కల ఉనికిని అవి దూరం నుంచే పసిగట్టి గుంపులు గుంపులుగా పంటక్షేత్రాల్లో చొరబడి పంటలను ధ్వంసం చేస్తుంటాయి. చేనులకు కాపలాగా ఉన్న రైతులు పందులను తరిమికొట్టే సమయంలో వాటిదాడిలో తీవ్రంగా గాయపడతారు. దీంతోపాటు ఇతర క్రూరమైన జంతువుల దాడిలో పశువులు కూడా మృత్యువాత పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి.

అంచనా వేయడంలో జాప్యం

అడవి పందుల దాడులతో జరిగిన నష్టానికి పరిహారం రావాలంటే దరఖాస్తు చేసుకున్న రైతుల పంట క్షేత్రాలను అటవీ అధికారులు సందర్శించి, నష్టం అంచనా వేయాల్సి ఉంది. అయితే సకాలంలో వారు రాకపోవడంతో పరిహారంపై రైతులు ఆసక్తి చూపడం లేదు. దరఖాస్తు సమయంలోనే రెవెన్యూ, వ్యవసాయ, అటవీశాఖ అధికారుల నివేదికలు జతచేసి పంపిస్తున్నా విచారణ పేరుతో నెలల తరబడి ఫైల్ ముందుకు కదలడం లేదు. యేటా ఎంతోమందికి పరిహారం ఇచ్చారనేది కూడా అధికారుల వద్ద సమాచారం లేకపోవడం గమనార్హం. వన్యప్రాణుల దాడిలో మనుషులు మృతిచెందితే గతంలో రూ.5లక్షల పరిహారం ఉండగా, ప్రస్తుతం దానిని రూ.10లక్షలకు పెంచారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ.75వేలు ఉంటే ప్రస్తుతం రూ.లక్ష, పంటనష్టం జరిగితే ఎకరాకు గతంలో రూ.6వేలు ఉంటే ఇప్పుడు రూ.7,500, పశువులు చనిపోతే గతంలో రూ.20 వేలు ఉండగా ప్రస్తుతం రూ.50 వేలకు పెంచారు.


సీతానగరంలో అడవి పందుల సంచారంతో ధ్వంసమైన మొక్కజొన్న పంట (ఫైల్)

పరిహార నిబంధనలు ఇవే..

అటవీ జంతువులతో ప్రమాదం జరిగినా, వ్యక్తులు మృతి చెందిన, పంటలకు నష్టం వాటిల్లినా.. సంబంధిత అటవీశాఖ నుంచి పరిహారం పొందవచ్చు. అయితే పాములు, కోతుల కారణంగా మృతి చెందినా, గాయపడ్డ పరిహారానికి అర్హత ఉండదు. కేవలం వన్యప్రాణుల దాడిలో జరిగిన నష్టానికి పరిహారం పొందవచ్చు. సంఘటనలు జరిగిన ఒకట్రెండురోజుల్లో సంబంధిత అటవీశాఖ రేంజ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వ్యవసాయశాఖ అధికారి, రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా పంటనష్టం జరిగిన ప్రదేశానికి వెళ్లి పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తారు. వారు విచారణ జరిపి బాధితులకు నష్టపరిహారం మంజూరు చేస్తారు. కాగా, క్షేత్రస్థాయిలో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నా.. సంబంధిత శాఖల అధికారులు వేర్వేరుగా వన్యప్రాణుల దాడుల్లో ధ్వంసమైన పంట క్షేత్రాలను పరిశీలిస్తున్నారు. ఇలా ఒక్కొక్క అధికారి చుట్టు రైతులు తిరగాల్సిన దయనీయమైన పరిస్థితి నెలకొంది.

సంక్రాంతి కీడు అంటూ..

● పల్లెల్లో ఐదు రకాల గాజుల సెంటిమెంట్
● మూఢనమ్మకాలను పట్టించుకోవద్దంటున్న విద్యావంతులు

గూడూరు(మహబూబాబాద్ జిల్లా), జనవరి 9 : ఈ సంవత్సరం సంక్రాంతి పండుగ కీడుతో వచ్చిందంట..! అందుకని ఒక్క కుమారుడు ఉన్న తల్లులు ఇద్దరు కుమారులు కలిగిన తల్లుల వద్ద డబ్బులు తీసుకుని ఐదు రకాల గాజులను వేయించుకోవాలి, లేదంటే ఒక్క కొడుకుకు కీడు తప్పదు. ఈ విషయం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఓ వైపు ప్రపంచం సైన్స్ పరంగా అభివృద్ధిలో దూసుకుపోతోంటే ఈ ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి అసత్య మూఢనమ్మకాలు కొనసాగుతున్నాయి. సంక్రాంతి పండుగ రాబోతున్న వేళ తాజాగా ఈ ప్రచారం షికారు చేస్తోంది. ఇద్దరు కుమారులు ఉన్న తల్లుల వద్ద డబ్బులు తీసుకుని ఒక్క కుమారుడు ఉన్న తల్లులు ఐదు రకాల గాజులు కొనుక్కోవాలంట..! అవి మళ్లీ ఒక కొడుకు ఉన్న వారితోనే వేయించుకోవాలంట.. ఈ వింత ప్రచారం పల్లెల నుంచి పట్టణాలకు పాకింది. మహిళలు ఈ ప్రచారాన్ని నమ్ముతూ.. గాజుల షాపుల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఇదిలా ఉండగా సైన్స్ ఉపాధ్యాయుడు, మండల నోడల్ అధికారి చీర భిక్షపతి ఈ వింత ప్రచారాన్ని నమ్మొద్దని సూచిస్తున్నారు. ఆధునిక యుగంలో ఇలాంటి వాటిని ప్రోత్సహించవద్దన్నారు. గతంలో సైతం సంక్రాంతి, ఉగాది పండుగల ముందు వదిన, మరదళ్ల గాజులు, అన్నదమ్ముళ్లకు కుడుకలు, ఆడబిడ్డలకు కుంకుమభరణాలు, చీరలంటూ ప్రచారాలు జరిగాయని, ఇలాంటి వాటిని ప్రతీ ఒక్కరు ఖండించాలని భిక్షపతి కోరారు.

నిట్‌లో కేర్ ఆస్పత్రి వైద్యశిబిరం

కాజీపేట, జనవరి 9: నిట్‌లో మంగళవారం హైదరాబాద్ కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆర్థోపెడిక్ డాక్టర్ హరీష్, కార్డియాలజిస్ట్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి హాజరై నిట్ స్టిబందికి, స్టూడెంట్స్‌కు సుమారు 150 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో నిట్ హెల్త్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే కార్మికులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

కాజీపేట, జనవరి 9: రైల్వే కార్మికులకు నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. రైల్వే కార్మికుల డిమాండ్‌లను నెరవేర్చకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కాజీపేట రైల్వేస్టేషన్ ఎదుట రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో ఓపీఎస్‌ను వెంటనే అమలు చేయాలని మంగళవారం రెండో రోజు రిలే దీక్షలు చేశారు. ఈ దీక్షలను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరై ప్రారంభించి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగాలు భర్తీ చేయకుండా నిరుద్యోగుల జీవితాలతో సైతం మోదీ ప్రభుత్వం ఆటలాడుకుం టోందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అనంతరం ఉద్యోగులకు అన్నివిధాలుగా న్యాయం చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ సంఘ్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కొత్త మురళీ కృష్ణ, కేంద్ర కమిటీ సభ్యుడు చింతమురళి, సాధినేని వెంకటనారాయణ, ఐఎన్‌టీయూసీ జిల్లా సెక్రటరీ, రన్నింగ్ బ్రాంచ్ వర్కింగ్ చైర్మన్ పాక రాజ్‌కుమార్, అభిలాష్, ముస్తాక్ హుస్సేన్, బలివేందర్ సింగ్, లక్ష్మీనారాయణ, రాజలింగం, స్థానిక కార్పొరేటర్ విజయ శ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్లు రావుల సదానందం, గోల్కొండ రాంబాబు, కాంగ్రెస్ నాయకులు ఎం.డి.అంకూస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హాస్టల్స్ డైరెక్టర్‌గా
ప్రొఫెసర్ శ్రీనివాసరావు బాధ్యతలు

కేయూ క్యాంపస్, జనవరి 9: కాకతీయ యూనివర్సిటీ నూతన హాస్టల్స్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ పెదమల్ల శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఇప్పటివరకు హాస్టల్స్ డైరెక్టర్‌గా ఉన్న జువాలజీ విభాగం ప్రొఫెసర్ వై.వెంకయ్య నుంచి కేయూ హాస్టల్స్ ఆఫీస్‌లో బాధ్యతలు స్వీకరించారు. కాగా, బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావును ఆల్ ఇండియా వర్సిటీ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్, దూరవిద్య కేంద్రం పీఆర్‌ఓ డాక్టర్ సంగాల ఎప్రామ్‌రాజ్, కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, తదితరులు పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు.


డైరెక్టర్ శ్రీనివాసరావును అభినందిస్తున్న శ్రీధర్‌కుమార్‌లోథ్, చిలువేరు రాజ్‌కుమార్ తదితరులు

ఐటీసీ చేతికి బిల్ట్!

● పేపర్‌మిల్లు, ఆహార ఉత్పత్తుల యూనిట్ ఏర్పాటుకు అవకాశం ● నెలరోజులుగా కొనసాగుతున్న పాత యంత్రాల తొలగింపు ● అందుబాటులో 750 ఎకరాల భూములు ● మంత్రి సీతక్క చొరవపై సర్వత్రా హర్షాతిరేకాలు



బిల్ట్ ప్రధాన గేటు

ములుగు, జనవరి 9: ఎట్టకేలకు బిల్ట్‌కు మంచిరోజులు రాబోతున్నాయి. మూడు దశాబ్దాలపాటు వెలుగు వెలిగిన ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురంలోని బిల్ట్ ఫ్యాక్టరీ పదేళ్లుగా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంది. కార్మికులకు, పరోక్షంగా ఆధారపడ్డ వారికి ఉపాధిని దూరం చేసింది. ఆశలు అడుగంటిన క్రమంలో ఐటీసీ సంస్థ ముందుకు వచ్చింది. ఇక పునరుద్ధరణ ప్రక్రియ చకాచకా సాగుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. అత్యాధునిక సాంకేతికతతో పాత పేపర్ మిల్లు స్థానంలో మళ్లీ పేపర్, ఆహార ఉత్పత్తుల తయారీ యూనిట్లను నెలకొల్పుతారని తెలుస్తోంది.

ఐటీసీ ద్వారా బిల్ట్ పునరుద్ధరణ

పారిశ్రామిక రంగంలో ఐటీసీ సంస్థకు దేశీయంగా మంచి పేరు ఉంది. 2014లో బిల్ట్ మూతపడ్డప్పటి నుంచి ఈ సంస్థపైనే అందరి దృష్టి మరలింది. పేపర్‌తోపాటు ఆహార ఉత్పత్తుల తయారీలో ఐటీసీ విస్తరించగా బిల్ట్ పునరుద్ధరణ ఈ సంస్థతో సాధ్యమవుతుందని సర్వత్రా భావించారు. సుదీర్ఘ కాలం తర్వాత ఎట్టకేలకు ఐటీసీయే ముందుకు రావడం గమనార్హం. నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ) తీర్పు తర్వాత బిల్ట్ ఆస్తులపై హక్కులు పొందిన ఫిన్‌క్వెస్ట్ ఫైనాన్స్ సొల్యూషన్ కంపెనీతో జరిపిన చర్చలు సఫలీకృతమైనట్లు సమాచారం. ఇటీవల పలు దఫాలుగా ఐటీసీ ప్రతినిధులు కమలాపురం వచ్చి సర్వేలు కూడా చేపట్టారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డిని ఇరు సంస్థల ప్రతినిధులు కలవడం, బిల్ట్‌ను నడిపించేందుకు ఐటీసీకి ప్రభుత్వం పక్షాన పూర్తి సహకారం అందిస్తామని వెల్లడించడంతో త్వరలోనే ఫ్యాక్టరీలో సైరన్ మోగుతుందనే తెలుస్తోంది.

బిల్ట్ స్థిరాస్తి 750 ఎకరాలు

బిల్ట్ సంస్థకు కమలాపురంలో 750 ఎకరాల భూములు ఉన్నాయి. 600 ఎకరాల్లో ఫ్యాక్టరీ, 150 ఎకరాల్లో కాలనీ, ఆస్పత్రి, అతిథిగృహాలు, పాఠశాల (థాపర్ విద్యావిహార్), స్టాఫ్‌క్లబ్ నిర్మాణాలు ఉన్నాయి. ఇవన్నీ ఎం.ఎల్.థాపర్ పేరిట ఉండగా ఎన్‌సీఎల్ఏటీ తీర్పు తర్వాత ఫిన్‌క్వెస్ట్ కంపెనీ ఆధీనంలోకి వెళ్లాయి. ప్రస్తుతం భవనాలన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిని కూల్చివేసి అవసరాలకు అనుగుణంగా నూతన నిర్మాణాలు చేసుకోవచ్చు.

కొనసాగుతున్న పాత యంత్రాల తొలగింపు

పదేళ్లుగా యంత్రాలు నడవకపోవడంతో తుప్పుపట్టి పనికిరాకుండా పోయాయి. ఇటీవలికాలంలో కొన్ని దొంగిలించబడ్డాయి. చోరీలకు పాల్పడుతున్న పలువురిని పోలీసులు అరెస్టు చేసి సామగ్రిని పట్టుకున్నారు. ఈనేపథ్యంలో ఫ్యాక్టరీలోని పాత యంత్రాలను ఫిన్‌క్వెస్ట్ సంస్థ ఆధ్వర్యంలో తొలగిస్తున్నారు. నెలరోజులుగా కార్మికులు భారీ యంత్రాలను విడదీస్తుండగా వాహనాల్లో తరలిస్తున్నారు. ఆరు నెలల కాల వ్యవధిలో పాత యంత్రాల తొలగింపు పూర్తిచేసి ఐటీసీకి అప్పగించేలా ఆసంస్థ ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం.

ఉపాధికి ఊతం

బిల్ట్ ఫ్యాక్టరీ తిరిగి తెరుచుకుంటే స్థానికులకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ఉన్నత విద్యార్హత ఉన్నప్పటికీ సరైన అవకాశాలు లేక చాలా మంది పట్టణాలకు వెళ్తున్నారు. కొందరు పొరుగు రాష్ట్రాల్లో పనిచేస్తున్నారు. బిల్ట్‌తో అలాంటి వారందరికీ ఉద్యోగాలు లభిస్తాయనే ఆశ కలుగుతోంది. పరోక్షంగా వందలాది కుటుంబాలకు ఉపాధి కలగనుంది. కర్మాగారం లేఆఫ్ ప్రకటించిన తర్వాత 670 మంది పర్మినెంట్ కార్మికులు మిగిలారు. గడిచిన పదేళ్లలో 58 మంది వివిధ కారణాలతో మరణించారు. 37మంది ఉద్యోగ విరమణ పొందారు. ఎన్‌సీఎల్ఏటీ ఆదేశాలతో ఇటీవల వీరి కుటుంబాలకు గ్రాట్యుటీ కింద వారివారి సర్వీసును బట్టి కొంత మొత్తాన్ని చెల్లించారు. 2020 వరకు సర్వీసును పరిగణలోకి తీసుకోవాల్సి ఉండగా 2015 డిసెంబరు కాలానికే ఇచ్చారని కార్మికులు చెబుతున్నారు. చట్ట ప్రకారం పూర్తి మొత్తంతోపాటు పెండింగ్ వేతనాలిచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు. కార్మిక కుటుంబాలకు చెందిన నిరుద్యోగ యువతకు అర్హతను బట్టి ఉద్యోగావకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సీతక్క కృషిపై సర్వత్రా హర్షం

ములుగు ఎమ్మెల్యే సీతక్క రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నెలరోజుల వ్యవధిలోనే బిల్ట్ ఫ్యాక్టరీపై సీఎం స్థాయిలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఫ్యాక్టరీని తెరిపించే విషయంలో 2014 నుంచి సీతక్క పోరాడుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా అసెంబ్లీలో గత ప్రభుత్వంపై అనేక పర్యాయాలు ఒత్తిడి తెచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తొలి ప్రాధాన్యంగా బిల్ట్ అంశాన్ని తీసుకుంటానని, ఫ్యాక్టరీని పునరుద్ధరించేందుకు కృషి చేస్తానని ఎన్నికల ప్రచార సభల్లో ప్రకటించారు. ఇచ్చిన మాట మేరకు ఐటీసీ సంస్థను ఒ ప్పించి ప్రభుత్వం ద్వారా అన్ని విధాలా సహకారానికి భరోసా ఇప్పించారు. ఆ సంస్థ ప్రతినిధులు సానుకూలంగా స్పందించడం, పాత యంత్రాల తొలగింపు ప్రక్రియ కొనసాగుతుండటం, ఏళ్లకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల గ్రా ట్యుయిటీ సెటిల్ కావడం వంటి అనుకూల పరిణామాలు చకాచకా చోటుచేసుకోవడంతో బిల్ట్‌కు మంచిరోజులు వస్తాయనే ఆశకు మరింత బలాన్నిస్తున్నాయి.

'బాలికలపై వివక్షత చూపవద్దు'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 9 : బాలికలపై లింగ వివక్షత చూపవద్దని జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ ప్రత్యేకాధికారిని నలమాస అరుణ అన్నారు. జిల్లా కేంద్రం కంకరబోడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా మహిళా సాధికారత కేందంరం ఆధ్వర్యంలో 'బేటీ బచావో-బేటీ పడావో'పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అరుణ మాట్లాడుతూ బాల్యవివాహాలను నిరోధించాలని, పిల్లల అక్రమ రవాణా పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సూచించారు. అనంతరం బాలికలకు శానిటరీ నాప్‌కిన్స్ పంపిణీ చేశారు. బాలికలకు అపరిచితుల నుంచి వేధింపు ఫోన్‌కాల్స్ హెల్ప్ లైన్‌నంబర్స్ : 1098, 181, 100, 1930 సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సాధికారత బాధ్యులు సంధ్యారాణి, రాకేష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నమ్మినోళ్లు మోసం చేశారు : మాజీ ఎమ్మెల్యే రెడ్యా

మరిపెడ, జనవరి 9 : నమ్మినోళ్లు మోసం చేశారు.. ప్రజల తీర్పును గౌరవిస్తానని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ అన్నారు. మంగళవారం మరిపెడలోని జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ గుడిపూడి నవీన్‌రావు గెస్ట్‌హౌస్‌లో డోర్నకల్ నియోజకవర్గ స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి డోర్నకల్ అసెంబ్లీ ఎన్నికలపై సమీక్షించారు. అనంతరం రెడ్యానాయక్ మాట్లాడారు. ఓటమిపై ఏలాంటి బాధలేదని.. ఆర్థికంగా ఇబ్బంది జరిగిందన్నారు. ఈ ఎన్నికల్లో ఎవ్వరెవ్వరో తన చుట్టూ తిరిగినప్పటికీ గెలుపు సాధ్యం కాలేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ప్రజలతో కలిసి పోరాటం చేస్తామన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నూకల నరేశ్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ నవీన్, డీసీసీబీ డైరెక్టర్ చాపల యాదగిరిరెడ్డి, జిల్లా రైస్ మిల్లర్స్ అధ్యక్షుడు డీఎస్. రవిచంద్ర, మాజీ ఓడీసీఎంఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, మరిపెడ మునిసిపల్ చైర్‌పర్సన్ సింధూరకుమారి, ఎంపీపీ అరుణరాంబాబు, జడ్పీటీసీ శారద రవీందర్, వైస్ ఎంపీపీ అశోక్‌రెడ్డి, వైస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, సర్పంచ్‌ల, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు తాళ్లపెల్లి శ్రీనివాస్, రఘురామ్, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడువుప్పల నాగేశ్వర్‌రావు, ఆరు మండలాల ఎంపీపీలు, బీఆర్ఎస్ బాధ్యులు, పీఏసీఎస్ చైర్మన్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

ఆర్‌యూపీపీ క్యాలెండర్ ఆవిష్కరణ

మహబూబాబాద్ టౌన్, జనవరి 9 : కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ రాష్ట్రం (ఆర్‌యూపీపీ-టీఎస్) క్యాలెండర్‌ను మంగళవారం జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆవిష్కరించారు. పండిట్ టీచర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని సంఘం బాధ్యులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మడిపెల్లి రమేష్, కొలిపాక శ్రీనివాస్, కంవచర్ల సంపత్, రాదండి సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంపీపీ, బీఆర్ఎస్ నాయకులు

మహబూబాబాద్ టౌన్, జనవరి 9 : కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌ను ఆర్యవైశ్యసంఘం నేతలు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇటీవల కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఆర్య వైశ్యసంఘం జిల్లా అధ్యక్షుడు నాళ్ల లక్ష్మీనర్సింహారావు, మండల అధ్యక్షుడు బోనగిరి గిరిధర్‌గుప్తా, జంగాల సదాశివుడు, ఇమ్మడి కృష్ణమూర్తి, బోనగిరి ప్రసాద్, ఎన్.వేణు, వొబిలిశెట్టి శ్రీనివాస్, కె.సోమన్న, చిదిరాల జ్ఞానేశ్వర్, శ్రీరాం ప్రసాద్ పాల్గొన్నారు.

● పెద్దవంగర : నూతన కలెక్టర్‌గా బాధ్యతలను స్వీకరించిన అద్వైత్‌కుమార్ సింగ్‌ను కలెక్టరేట్‌లో ఎంపీపీ రాజేశ్వరి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, ఎస్ఆర్ఐ, బీఆర్ఎస్ నాయకులు పాకనాటి సునిల్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కారించి శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్

మహబూబాబాద్ రూరల్, జనవరి9 : జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్ర శేఖర ప్రసాద్‌ను మంగళవారం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అద్వైత్‌కుమార్‌సింగ్ జిల్లా కోర్టులో ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖర ప్రసాద్‌ను కలిసి మొక్కను అందజేశారు.



జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్

'హిందీని ప్రమాణాలతో బోధించాలి'

కేసముద్రం, జనవరి 9 : హిందీ విషయాన్ని విద్యార్థులకు ఒత్తిడిలేకుండా చక్కని ప్రమాణాలతో ఉపాధ్యాయులు బోధించాలని అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ అజాద్ చంద్రశేఖర్ సూచించారు. మండలంలోని కల్వల జడ్పీహైస్కూల్లో మంగళవారం కేసముద్రం, ఇనుగుర్తి, నెల్లికుదురు మండలాల హిందీ ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బండారు నరేందర్, ఎస్ఆర్‌పీ అబ్దుల్ నబీ, జిల్లా ఆర్‌పీ రవి పాల్గొన్నారు.

17 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

మరిపెడ, జనవరి 9 : మునిసిపల్ కేంద్రంలో తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులు 17 క్వింటాళ్ల నల్లబెల్లం, పట్టికను మంగళవారం రాత్రిపట్టుకున్నారు. ఎస్సై తాహెర్ తెలిపిన వివరాల ప్రకారం. ఓవ్యక్తి ఆశోక్‌లేలాండ్ వాహనంలో 34 బస్తాల బెల్లం, రెండు బస్తాల పట్టికను తీసుకెళ్తుండగా పోలీసులను చూసి ఆ వాహనం అక్కడే వదిలి పరారయ్యాడు. ఆ వాహనాన్ని తనిఖీ చేయగా అందులో ఉన్న బెల్లం విలువ రూ 1.80 లక్షలు ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తాహెర్ తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు..

● దంతాలపల్లి : మండల కేంద్రంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి కొమ్ములవంచకు తరలిస్తున్న నల్లబెల్లం, పటికను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రమేష్‌బాబు విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తురు నుంచి బోలేరో వాహనంలో తరలిస్తున్న 30 క్వింటాళ్ల నల్లబెల్లం, 50 కిలోల పటికతో పాటు బోలేరో వాహనాన్ని మండల కేంద్రంలో స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏపీలోని చిలుకలూరిపేటకు చెందిన డ్రైవర్ విట్ర భానుప్రసాద్‌ను అదుపులో తీసుకోగా నల్లగొండ జిల్లా రావులపల్లికి చెందిన గుగులోతు సంతోష్, నర్సింహులపేట మండలం కొమ్ములవంచకు చెందిన జాటోతు హచ్చలు పరారీలో ఉన్నారని ఎస్సై తెలిపారు.

నెహ్రూసెంటర్‌లో ద్విచక్రవాహనం చోరీ

మహబూబాబాద్ రూరల్, జనవరి 9 : జిల్లా కేంద్రంలోని నెహ్రూసెంటర్‌లో సెల్ వరల్డ్ షాపు ఎదుట పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం అపహరించుకుపోయినట్లు బాధితుడు ప్రభాకర్ తెలిపారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం. తనషాప్ ఎదుట రాత్రి పార్కింగ్ చేసిఇంట్లో నిద్రిస్తున్న సమయంలో బైక్‌ను అపహరించుకుపోయినట్లు చెప్పారు. సీసీ కెమెరాలో బైక్‌ను దొంగిలిస్తున్న దృశ్యం రికార్డ్ అయిందని చెప్పారు. ఈ విషయంపై టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

దంతాలపల్లి, జనవరి 9 : అక్రమంగా నర్సింహులపేట మండలంలోని ఆకేరు వాగు నుంచి తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను మంగళవారం దంతాలపల్లి మండల కేంద్రంలో సీజ్ చేసినట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సింహులపేట మండలం కొమ్ములవంచకు చెందిన జాటోతు శ్రీనివాస్, ఆరునూర్ల రాములుపై కేసు నమోదు చేసి, మైనింగ్ అధికారులకు అప్పగించామన్నారు.

మానుకోటలో వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన సంతోష్‌కుమార్

మహబూబాబాద్ రూరల్, జనవరి 9 : జిల్లా కేంద్రం శివారు ఇల్లందు బైపాస్ రోడ్డుకు చెందిన ఒడియాలసంతోష్ కుమార్ అనేవ్యక్తి అదృశ్యమైనట్లు టౌన్ ఎస్సై శివ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. ఇల్లందు రోడ్డులో నివాసముంటున్న ఒడియాల సంతోష్‌కుమార్ కిరాణాషాపు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈనెల 3వ తేదీన తెల్లవారుజామున ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు చెప్పారు. భార్య శోభారాణి బంధువుల ఇండ్లలో వాకబు చేసినప్పటికి ఎక్కడ అతని ఆచూకీ లభించకపోవడంతో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. శోభరాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా ఫాతిమాషేక్ జయంతి వేడుకలు



ఫాతిమాషేక్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న వివిధ పార్టీలు, సంఘాల నాయకులు

మహబూబాబాద్ టౌన్, జనవరి 9 : జిల్లా కేంద్రంలో మంగళవారం ఆల్ అన్సార్ యూత్ అసోసియేషన్, తెలంగాణ మైనార్టీ ఫోరం, మా అసోసియేషన్, పాస్ ఆధ్వర్యంలో సామాజిక సంఘ సంస్కర్త, భారతదేశ తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమాషేక్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన స్థానిక సబ్‌రిజిస్ట్రార్ తస్లీమామహ్మద్ మాట్లాడారు. ప్రాచీన కాలంలో విద్య సామాన్యులకు అందనిద్రాక్షగా ఉండేదని అలాంటి తరుణంలో మహనీయులు జ్యోతిబాపూలే, సావిత్రిబాయిపూలే దంపతులతో కలిసి సమాజంలో అసమానతలు రూపుమాపుతూ మహిళాభ్యున్నతికి ఫాతిమాషేక్ కృషి చేశారని చెప్పారు. సాంఘీక దురాచారాలపై అలుపెరగని పోరాటం చేసి మహిళా విద్యాభ్యున్నతికి మహనీయురాలు ఫాతిమాషేక్ ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు ఘనపురపు అంజయ్య, బొడ్డుపల్లి ఉపేంద్రం, కామ సంజీవరావు, దారా ఇందుభారతి, ఇంతియాజ్‌నదీమ్‌ఖాన్, రహీం, మహ్మద్ నజీర్, ఇమాముద్దీన్, ఇస్మాయిల్, బండారు వెంకటరమణ, ఇనుగుర్తి సుధాకర్, బానోత్ ప్రసాద్, శివకుమార్, నయీమ్ పాల్గొన్నారు.

● సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సామాజిక సంఘ సంస్కర్త, భారతదేశ తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమాషేక్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆమె చిత్రపటానికి సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

డబ్బులు ఇవ్వలేదని మరొకరికి అవకాశం

● మైనార్టీ వెల్ఫేర్ అధికారి నిర్వాహకం ● సెక్యూరిటీగా అవకాశం కలిపించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి

తొర్రూరు రూరల్, జనవరి 9 : ఏడేళ్లుగా తొర్రూరు ముస్లిం మైనార్టీ గురుకులంలో హౌస్ కీపింగ్ వర్కర్‌గా పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని, సెక్యూరిటీగా కన్వెన్షన్ చేయమని విజ్ఞప్తి చేయగా మైనార్టీ వెల్ఫేర్ జిల్లా ఇన్‌చార్జి డబ్బులు తీసుకొని మరొకరికి అవకాశం కలిపించినట్లు బాధితురాలు సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు పిర్యాదు చేసింది. బాధితురాలు నసీమా మంగళవారం మాట్లాడుతూ తొర్రూరు మైనారిటీ గురుకులంలో ఔట్‌సోర్సింగ్ విధానంలో హౌస్ కీపింగ్‌గా ఏడు సంవత్సరాలుగా తాను విధులు నిర్వహిస్తుండగా కరోనా సోకడంతో ఆరోగ్యం క్షిణించిందని తెలిపింది. దుమ్ముధూళీతో ఇబ్బంది పడుతున్న తనకు సెక్యూరిటీగా విధులు కల్పించాలని గతంలో మాజీ మంత్రి దయాకర్‌రావుకు, నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత హైదరాబాద్‌లో జరిగిన ప్రజాదర్బార్‌లో పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్క, దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖకు విన్నవించుకున్నట్లు తెలిపింది. దీంతో సానుకూలంగా స్పందించిన వారు తక్షణమే కన్వెన్షన్ చేయాలని 12, డిసెంబరు 2023న కలెక్టర్‌కు పంపించగా కలెక్టర్ ఆదేశించినప్పటికీ మైనారిటీ వెల్ఫేర్ ఇన్‌చార్జి శ్రీనివాసులు అధికారుల ఆదేశాలను తుంగలో తొక్కి రూ.లక్ష ఇస్తేనే కన్వెర్షన్ చేస్తానంటూ మరొకరి నుంచి డబ్బులు తీసుకొని జనవరి2, 2024న జాయినింగ్ ఆర్డర్ ఇచ్చి తనకు అన్యాయం చేసినట్లు తెలిపింది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి తనకు న్యాయం చేయాలని గ్రీవెన్స్‌లో పిర్యాదు చేసిన్నట్లు ఆమె పేర్కొంది.



గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన రశీదు చూపుతున్న నసీమా

'ఎన్‌పీఎస్ వద్దు.. ఓపీఎస్ ముద్దు'

డోర్నకల్, జనవరి 9 : రైల్వేలో నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని దక్షిణమధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో డోర్నకల్‌లోని పీడబ్ల్యూఐ కార్యాలయం వద్ద మంగళవారం రిలే నిరహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం సెక్షన్ బాధ్యులు బషీర్‌ఆలీ మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానం వల్ల ఉద్యోగులు భారీగా నష్టపోతున్నారని, ఉద్యోగులకు పెన్షన్ అనేది హక్కు అని, హక్కులను కేంద్రప్రభుత్వం హరిస్తుందని అన్నారు. ఉద్యోగులకు రావాల్సిన డబ్బులను షేర్ మార్కెట్లలో పెట్టుబడులు పెడుతున్నారని, మార్కెట్ పతనమైనప్పుడు కార్మికులు కూడ తీవ్రంగ నష్టపోతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ కార్మికుల శ్రేయస్సును ఆలోచించి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ రిలే నిరహార దీక్ష శిబిరాన్ని సీపీఎం, కాంగ్రెస్ పార్టీల నాయకులు సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. నాయకులు రాంజీ, సైదేశ్వర్, రాజు, జయరాజు, బాజీ, షాహీద్, కాంగ్రెస్ నాయకులు సుమీర్‌చంద్‌జైన్, ప్రవీన్, శంకర్, నందనాయక్, తారాచంద్, హరికృష్ణ, సీపీఎం నాయకులు బొమ్మన అశోక్, దాసరి మల్లేశం పాల్గొన్నారు.

ఏఐసీసీ జాతీయ కార్యదర్శి దీపాదాస్ మున్షీని కలిసిన శ్రీకాంత్‌రెడ్డి

మహబూబాబాద్ రూరల్, జనవరి 9 : హైదరాబాద్‌లోని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వ్యవహారాల ఇన్‌చార్జి, ఏఐసీసీ జాతీయ కార్యదర్శి దీపాదాస్ మున్షీని మంగళవారం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే లోక్‌సభ ఎన్నికలపై చర్చించినట్లు చెప్పారు.



దీపాదాస్ మున్షీనికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి

'ఆన్‌లైన్' ప్రక్రియ వేగవంతం చేయాలి

నెల్లికుదురు, జనవరి 9 : ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలని తొర్రూరు ఆర్డీవో జి.నర్సింహ తెలిపారు. నెల్లికుదురు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియను మంగళవారం ఆయన పరిశీలించారు. ఎన్ని దరఖాస్తులు ఆన్‌లైన్ చేశారని అడిగి తెలుసుకున్నారు. సకాలంలో ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు ఆర్డీవో సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.రాజు, ఎంపీడీవో శేషాద్రీ పాల్గొన్నారు.

● నర్సింహులపేట : ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ పక్రియ ప్రభుత్వం విధించిన గడువులోగా పూర్తిచేయాలని మండల అధికారులను ఆర్డీవో నర్సింహారావు ఆదేశించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని సందర్శించి ఆన్‌లైన్ పక్రియను ఆర్డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17 లోగా ఆన్‌లైన్ పక్రియను పూర్తి చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వివేక్, ఎంపీడీవో భారతి, అధికారులు ఉన్నారు.

● పెద్దవంగర : ప్రజాపాలన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అభయ హస్తం దరఖాస్తులు ఎలాంటి పొరపాట్లుకు తావులేకుండా అన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆర్డీవో నరసింహరావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అభయహస్తం దరఖాస్తులు 'ఆన్‌లైన్' ప్రకియను ఆయన పరిశీలించారు. తహసీల్దార్ వీరగంటి మహేందర్, ఎంపీడీవో బి వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీవో సత్యనారాయణ, ఆర్ఐ లష్కర్ తదితరులు పాల్గొన్నారు.

కెనాల్‌కు గండ్లు పెడితే క్రిమినల్ కేసులు

దంతాలపల్లి, జనవరి 9 : ఎస్సారెస్పీ కెనాల్‌కు గండ్లు పెడితే క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని డీఈ వినయ్ హెచ్చరించారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలోని బృందం సభ్యులు మండల కేంద్రంలోని శ్రీబాలాజీ ఫంక్షన్ హాల్ వద్ద డీబీఎం 60 కెనాల్ ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీబీఎం 60 నుంచి వెళ్లే ఉప కెనాల్‌కు గండ్లు కానీ మట్టి తోలకం కానీ జరిగితే కఠిన చర్యలు తప్పదన్నారు. రైతులకు యాసంగిలో నీటిని అందించేందుకు గాను మార్చి 30 వరకు ఎస్సారెస్పీ నీటిని విడుదల చేస్తామన్నారు. కెనాల్ గేట్లను ఎత్తివేయకుండా చర్యలు తీసుకున్నామన్నారు. మరిపెడ మండలంతో పాటు చివరి ఆయకట్టు వరకు నీటి విడుదల చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ మౌనిక, వర్క్‌ఇన్‌స్పెక్టర్ దేవేందర్‌నాయక్ పాల్గొన్నారు.

'మానసిక ఉల్లాసానికి క్రీడలు'

పెద్దవంగర, జనవరి 9 : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని తొర్రూరు డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసంతోపాటు యువతలో పోటీతత్వం, స్నేహభావం పెరుగుతుందన్నారు. సీఐ సత్యనారాయణ, తహసీల్దార్ వీరగంటి మహేందర్, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ మాజీ పీసీసీ సభ్యులు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, శ్యామ్, మురళి, శ్రీనివాస్, రవి, సైదులు, వెంకన్న, హరికృష్ణ, వినోద్, రామ్‌చరణ్ పాల్గొన్నారు.

సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి

తొర్రూరు, జనవరి 9 : హిందూ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా సీడబ్ల్యూసీ చైర్మన్ ఎస్.నాగవాణి అన్నారు. మంగళవారం తొర్రూరులో ఆమె మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ స్వామి వివేకానందజయంతి సందర్భంగా జనవరి 11వ తేదీన అన్ని ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, 12వ తేదీ శుక్రవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించడం జరుగుతుందన్నారు. పోటీలో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందించనున్నట్లు తెలిపారు.

మంత్రి సురేఖను కలిసిన బలరాంనాయక్

మహబూబాబాద్ టౌన్, జనవరి 9 : హైదరాబాద్ సచివాలయంలో రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖను మంగళవారం కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేసినట్లు కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్ తెలిపారు.

రియల్ ఎస్టేట్ మీడియేటర్స్ అండ్ రియల్టర్స్ అడ్‌హాక్ కమిటీ ఎన్నిక

మహబూబాబాద్ టౌన్, జనవరి 9 : మానుకోట రియల్‌ఎస్టేట్ మీడియేటర్స్ అండ్ రియల్టర్స్ యూనియన్ అడ్‌హాక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోమంగళవారం సంఘ సభ్యులంతా సమావేశమై కమిటీని ఎన్నుకున్నారు. అడ్‌హాక్ కమిటీ కన్వీనర్‌లుగా పిట్టల గోపాల్ (రియల్టర్), మాదరబోయిన యాకన్న (మీడియేటర్)ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభ్యులంతా కలిసికట్టుగా ఉంటూ సంఘం బలోపేతంకోసం కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తీగల దుర్గేష్, చుంచు పద్మారావు, కాలేరు మురళీ, అశోక్, కుమార్, చాంద్‌పాషా, రవి, రాము, నాజర్, కార్తీక్, ఐలేష్, శ్రీను, ఉపేందర్, చందర్, వెంకన్న, శ్రీనివాస్, యాదగిరి, సురేష్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

కురవి, జనవరి 9 : మండలంలోని భద్రుతండా, తులిస్యతండా, లచ్చిరాం తండాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి పలువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ డీటీఎఫ్ ఎస్సై ఎస్.హరీష్ తెలిపారు. ఈ దాడుల్లో ఒక అశోక్ లేలాండ్ వాహనాన్ని, 20 క్వింటాళ్ల బెల్లం, క్వింటా పటిక, 20 లీటర్ల సారాయిని సీజ్‌చేసి షేక్ సైదులు, భూక్య సురేష్, మూడ్ జగన్, మూడ్ బాలులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

టీఎస్‌టీడబ్ల్యూటీయూ కాలెండర్ ఆవిష్కరించిన మంత్రి సీతక్క

కొత్తగూడ, జనవరి 9 : తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం (టీఎస్‌టీడబ్ల్యూటీయూ) ఆధ్వర్యంలో రూపొందిన కాలెండర్‌ను మంగళవారం హైదరాబాద్‌లో పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క ఆవిష్కరించారు. రాష్ట్ర అధ్యక్షుడు వజ్జ సురేందర్, ప్రధాన కార్యదర్శి ధరావత్ రాజు, ఉపాధ్యక్షుడు ఐలబోయిన వీరయ్య, సహాయ కార్యదర్శి రామచంద్రనాయక్, వాసంవీరస్వామి, చుంచ సారయ్య, కొక్కెర రమేష్ నాలి కోటయ్య, గబ్బ రవి, మల్లెల శ్రీను పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేయాలి

తొర్రూరు, జనవరి 9: బ్రాహ్మణుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం అన్ని విదాలుగా కృషి చేయాలని బ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ రాష్ట్ర కార్యదర్శి వింజమూరి సుధాకర్ అన్నారు. మంగళవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకుడు కాకిరాల హరిప్రసాద్‌తో కలిసి ఆయన మాట్లాడారు. బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఓలేటి లక్ష్మణాచార్యులు, ప్రతినిధులు ఓలేటి వెంకటచార్యులు, వెన్నప్ప కృష్ణమోహన్, అలహరి శ్యాం సుందరాచార్యులు, రేణికుంట్ల శివ శర్మ, గురుప్రసాద్, బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

'టీచర్లు సమయపాలన పాటించాలి'

నెల్లికుదురు, జనవరి 9 : ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని డీఈవో రామారావు తెలిపారు. నెల్లికుదురు మండలంలోని మదనతుర్తి పాఠశాలను మంగళవారం ఆకస్మీకంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఉదయమే పాఠశాల ప్రార్థన గీతంలో పాల్గొని విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీజీ మందుల శ్రీరాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీరభద్రుడి సన్నిధిలో.. హాస్యనటుడు బిత్తిరి సత్తి పూజలు

కురవి, జనవరి9 : ప్రముఖ హాస్యనటుడు, యాంకర్ బిత్తిరి సత్తి (కావలి రవికుమార్) కురవి శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిపారు. స్నేహితులతో కలిసి ఆలయానికి విచ్చేసిన ఆయన వీరభద్రస్వామి, భద్రకాళి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఈవో సత్యనారాయణను ఆలయ చరిత్ర అడిగి తెలుసుకున్నారు. వీరభద్రస్వామి దేవాలయం గురించిహైదరాబాద్‌లో చాలామంది స్నేహితులు చెబుతుంటే విన్నానని, అందుకే దర్శించుకునేందుకు ప్రత్యేకంగా వచ్చి మొక్కులు తీర్చుకున్నానని పేర్కొన్నారు. ఆయన వెంట దేవాలయ మాజీ చైర్మన్ మేక దామోదర్‌రెడ్డి ఉన్నారు.

ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 9 : పట్టణంలోని నర్సంపేట రోడ్డులో ఉన్న శ్రీమహాగాయత్రీదేవి దేవాలయం సమీపంలో నూతనంగా నిర్మించనున్న శ్రీఅభయాంజేయస్వామి దేవాలయ గుడి నిర్మాణానికి మంగళవారం స్థానిక శాసన సభ్యుడు డాక్టర్ భూక్య మురళీనాయక్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీఅభయాంజేయస్వామి దేవాలయ గుడి నిర్మాణం త్వరితగతిన పూర్తయి భక్తులు మొక్కులు చెల్లించుకుంటారనే ఆశాభావం వ్యక్తం చేశారు. మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, డీఎస్పీ సత్యనారాయణ, వార్డు కౌన్సిలర్ దండెబోయిన వెంకన్న, కోఆప్షన్ సభ్యుడు నిమ్మల శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, అనుమాల వెంకటేశ్వర్లు, చిదిరాల శరత్, వెంకట్రాం పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : ఎస్సై

చిన్నగూడూరు, జనవరి 9 : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, సమైక్యతను పెంపొందిస్తాయని ఎస్సై సంతోష్ అన్నారు. పగిడిపల్లిలో ప్రీమియర్ లీగ్ పీపీఎల్ (పగిడిపల్లి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ క్రీడోత్సవాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరి కృష్ణారెడ్డి, డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్, మండల అధ్యక్షుడు బిక్కునాయక్, రంగారెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు వెంకన్న, కిరణ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యా, ఉద్యోగ సాధికారిత సాధనే లక్ష్యం

మహబూబాబాద్ టౌన్, జనవరి 9 : ముదిరాజ్ సామాజిక వర్గంలో విద్యా, ఉద్యోగ సాధికారిత సాధనే ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా)లక్ష్యమని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ అన్నారు. మహబూబాబాద్‌లో జిల్లా అధ్యక్షుడు దుండి శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం మెపా జిల్లా కార్యవర్గసమావేశాన్ని నిర్వహించారు. మెపా మాసపత్రిక చీఫ్ ఎడిటర్ రమణ, సంఘం నాయకులు చిరుత వెంకటేశ్వర్లు, దుండిఅశోక్, పరమేశ్వర్, నిరంజన్, యాకయ్య, మురళీ, అశోక్, మహేష్, మహేందర్, యాకన్న, ప్రశాంత్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 9 : నెహ్రూ యువకేంద్రం యువతకు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని నెహ్రూ యువ కేంద్రం వరంగల్ జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్ అన్నారు. మహబూబాబాద్‌లోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నెహ్రూయువకేంద్రం ఆధ్వర్యంలో 'మైభారత్ వికసిత్ భారత్' అనే అంశంపై విద్యార్థులకు జిల్లాస్థాయి ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బి.నవ్య జిల్లాస్థాయి పోటీల్లో విజేతగా నిలవగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పోటీలో పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, రంగారెడ్డి, రాజేందర్, సత్యనారాయణ, అశోక్, తేజస్వీ, సుజిత్ పాల్గొన్నారు.

ఘనంగా స్వామివారికి మంగళహారతులు

డోర్నకల్, జనవరి 9 : ధనుర్మాసాన్ని పురస్కరించుకుని స్థానిక పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న గోదాదేవి-రంగనాథ స్వామిలకు మంగళవారం మహిళలు మంగళహారతుల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థుల క్షేత్రపర్యటన

కేసముద్రం, జనవరి 9 : మండలంలోని పెనుగొండ శివారు నర్సింహులగూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పరిసరాల విజ్ఞానంలో భాగంగా హెచ్ఎం కొడిపాక రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం క్షేతపర్యటన చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్, పోస్టాఫీస్, తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలు, పశువైద్యశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మండల విద్యావనరుల కేంద్రం, రైల్వేస్టేషన్‌ను సందర్శించి, ఆయా కార్యాలయాల పనితీరు, ఉద్యోగుల విధులను ప్రత్యక్షంగా విద్యార్థులు పరిశీలించారు.

ప్రభుత్వం స్థలాన్ని కేటాయించాలి

మహబూబాబాద్ టౌన్, జనవరి 9 : జిల్లాలోని మత్స్యకార్మికులకు ఇక్కడే చేపపిల్లలు ఉత్పత్తి చేసే విధంగా హాచరింగ్ నిర్మాణానికి స్థలాన్ని మత్స్యశాఖకు కేటాయించాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌ను మంగళవారం వినతిపత్రాన్ని అందించారు. పిడుగు వెంకన్న, రాంమ్మూర్తి, ఉప్పలయ్య, వెంకన్న, పులిగుజ్జు వెంకన్న, ప్రమిళ, సదానందం పాల్గొన్నారు.